క్లుప్తంగా

కల్వర్టు పనులకు భూమిపూజ



భూమిపూజలో పాల్గొన్న ఎమ్మెల్యే

జన్నారం: మండలకేంద్రంలోని ప్రధాన రహదారి అంగడి బజార్ ప్రాంతంలో డ్రెయినేజీపై కల్వర్టు నిర్మాణ పనులకు ఖానాపూర్ ఎమ్మెల్యే వెడ్మ బొజ్జు పటేల్ బుధవారం భూమిపూజ చేశారు. కార్యక్రమంలో మండల అధ్యక్షుడు ముజాఫర్ అలీఖాన్, ప్రధాన కార్యదర్శి మాణిక్యం, జిల్లా ఎంపీటీసీ ఫోరం అధ్యక్షుడు రియాజోద్దీన్, జిల్లా ప్రధాన కార్యదర్శి గుర్రం మోహన్‌రెడ్డి, సీనియర్ కాంగ్రెస్ నాయకులు తదితరులు పాల్గొన్నారు.

ముగిసిన ఉర్సు



ప్రార్థనలు చేస్తున్న ఎమ్మెల్యే వివేక్

చెన్నూర్: పట్టణంలోని పోస్టాఫీసు ఎదురుగా, జమా మసీదు పక్కన గల సయ్యద్‌షా బాబా రహెమతుల్లా అలై దర్గా వద్ద రెండు రోజుల పాటు నిర్వహించిన ఉర్సు బుధవారం ముగిసింది. మంగళవారం రాత్రి చెన్నూర్ ఎమ్మెల్యే సయ్యద్ షా బాబాకు చాదర్ సమర్పించి ప్రార్థనలు చేశారు. మాజీ జెడ్పీ వైస్ చైర్మన్ మూల రాజిరెడ్డి, జెడ్పీ కోఆప్షన్ సభ్యులు ఫయాజ్, మాజీ సర్పంచ్ గొడిసెల బాపురెడ్డి, అజీజ్, ఉర్సు ఉత్సవ కమిటీ అధ్యక్షుడు నవాజ్‌లు పాల్గొన్నారు.

8వ రోజుకు నిరాహార దీక్ష

పాతమంచిర్యాల: శాలివాహన పవర్‌ప్లాంట్ కార్మికులు చేపట్టిన నిరాహారదీక్ష బుధవారం 8వ రోజుకు చేరింది. కార్యక్రమంలో బీఎంఎస్ జిల్లా అధ్యక్షుడు లగిశెట్టి కమలాకర్, ప్లాంట్ కార్మిక సంఘం అధ్యక్షుడు కుంటాల శంకర్, ఉపాధ్యక్షులు కాయితి శ్రీనివాస్, ఆనందరావు, సత్యం, రాజయ్య, తిరుపతి, బుచ్చయ్య పాల్గొన్నారు.

బిజినెస్ అస్తిత్వంపై పోటీలకు ఎంపిక

మంచిర్యాలఅర్బన్: హైదరాబాద్‌లో ఈ నెల 7 నుంచి 9 వరకు ఆల్ ఇండియా మేనేజ్‌మెంట్ అసోసియేషన్, అశోక స్కూల్ ఆఫ్ బిజినెస్ సంయుక్తంగా నిర్వహిస్తున్న స్టూడెంట్ మేనేజ్‌మెంట్ గేమ్ బిజినెస్ సిమ్యులేషన్‌కు వివేకావర్ధిని డిగ్రీ, పీజీ కళాశాల విద్యార్థులు ఎంపికయ్యారు. కళాశాల నుంచి టీమ్‌కు నలుగురు చొప్పున, రెండు టీంలను సెలక్షన్ చేసి పంపించనున్నట్లు కరస్పాండెంట్ చంద్రమోహన్‌గౌడ్ తెలిపారు. కో–ఆర్డినేటర్‌గా వంశీ వ్యవహరించనున్నారు. దేశవ్యాప్తంగా బిజినెస్ స్కూళ్లో చదువుతున్న విద్యార్థులతో పోటీ నైపుణ్యాలు, బిజినెస్ అస్తిత్వంపై జరగనున్న పోటీల్లో పాల్గొననున్నారు.

ఈజీఎస్ పనులపై సమీక్ష

భీమారం: అడిగిన ప్రతీ కూలికి గ్రామాల్లో ఉపాధిహామీ పథకం ద్వారా పనులు కల్పించాలని ఎంపీడీవో శ్రీనివాస్ ఆదేశించారు. ఈజీఎస్ పనులపై బుధవారం స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో నిర్వహించిన సమీక్షా సమావేశంలో ఆయన మాట్లాడారు. జాబ్ లేని వారికి కార్డులు ఇప్పించాలన్నారు. ఇందులో ఎంపీవో సతీష్ రెడ్డి, పంచాయతీ కార్యదర్శులు, ఈజీఎస్ సిబ్బంది పాల్గొన్నారు.

జేసీబీ, ట్రాక్టర్ల సీజ్



సీజ్ చేసిన జేసీబీ, ట్రాక్టర్లు

భీమిని: అనుమతులు లేకుండా అక్రమంగా మట్టి తరలిస్తున్న వాహనాలను తహసీల్దార్ దత్తుప్రసాద్‌రావు ఆధ్వర్యంలో రెవెన్యూ అధికారులు సీజ్ చేశారు. కన్నెపల్లి మండలంలోని సబ్‌స్టేషన్ సమీపంలో జేసీబీతో మట్టిని తీసి ట్రాక్టర్ల ద్వారా అక్రమంగా తరలిస్తుండగా బుధవారం రెవెన్యూ అధికారులు జేసీబీతో పాటు రెండు ట్రాక్టర్లను సీజ్ చేసి పోలీసులకు అప్పగించారు.

లక్సెట్టిపేట సీఐగా నరేందర్



లక్సెట్టిపేట: పట్టణ సర్కిల్ ఇన్‌స్పెక్టర్‌గా అల్లం నరేందర్ బుధవారం బాధ్యతలు స్వీకరించారు. ఇప్పటివరకు ఇక్కడ విధులు నిర్వర్తించిన క్రిష్ణ బదిలీపై పెద్దపల్లి వెళ్లగా, రెబ్బనలో సీఐగా విధులు నిర్వర్తించిన నరేందర్ ఇక్కడకు బదిలీపై వచ్చి బాధ్యతలు స్వీకరించారు. లక్సెట్టిపేట, దండేపల్లి, జన్నారం ఎస్సైలు, పోలీసు సిబ్బంది ఆయనకు శుభాకాంక్షలు తెలిపారు.

పల్లెల్లో పారిశుధ్యంపై గ్రామసభలు

- సమస్యలపై చర్చించిన అధికారులు

భీమారం/బెల్లంపల్లిరూరల్/దండేపల్లి/చెన్నూర్‌రూరల్/తాండూర్/మంచిర్యాలరూరల్(హాజీపూర్): తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన ప్రత్యేక పారిశుధ్య కార్యక్రమాన్ని పురస్కరించుకుని జిల్లా వ్యాప్తంగా బుధవారం పలు గ్రామాల్లో ప్రత్యేక గ్రామసభలు నిర్వహించి పారిశుధ్య పనులపై చర్చించారు. గ్రామాల్లో నెలకొన్న సమస్యలను ప్రజలను అడిగి తెలుసుకున్నారు. సమస్యల పరిష్కారానికి సిబ్బంది ప్రత్యేక దృష్టి సారించాలని ఉన్నతాధికారులు సూచించారు. పారిశుధ్యం, మంచినీటి సరఫరా, ఇతర సమస్యలు గుర్తించి వాటి పరిష్కారానికి ప్రణాళికలు చేయాలని ఆయా గ్రామాల ప్రత్యేకాధికారులు పంచాయతీ సిబ్బందికి సూచించారు. గ్రామీణులు పారిశుధ్య సమస్యలు తలెత్తకుండా గ్రామ పంచాయతీకి సహకరించాలన్నారు. పలు అంశాల పై అవగాహన కల్పించారు. ర్యాలీలు నిర్వహించారు. బెల్లంపల్లి మండలం చంద్రవెల్లిలో విద్యార్థులకు, దండేపల్లిలో మహిళా సంఘాల సభ్యులకు ముగ్గుల పోటీలు నిర్వహించి బహుమతులు అందజేశారు. ఆయా కార్యక్రమాల్లో గుడిపేటలో డీపీఓ. వెంకటేశ్వర్‌రావు, హాజీపూర్‌లో తహసీల్దార్ సతీశ్‌కుమార్, భీమారంలో ప్రత్యేక అధికారి శ్రీనివాస్, బెల్లంపల్లిలో ఎంపీడీఓ రాజేందర్, గ్రామ పంచాయతీల ప్రత్యేక అధికారులు సుజాత, శ్రీనివాస్, సుప్రజ, విష్ణుకుమార్, విద్యుత్ శాఖ ఏ.ఈ రాంమనోహర్, ఆస్నాదలో ఎంపీడీవో శ్రీనివాస్, తాండూర్‌లో తహసీల్దార్ రోహిత్ దేశ్‌పాండే, ఎంపీడీవో ప్రవీణ్‌కుమార్, ఎంఈవో ప్రభాకర్, మండల వ్యవసాయ అధికారి కిరణ్మయి, పశు వైద్యాధికారులు భూమయ్య, నర్సింహారావు, మండల పంచాయతీ అధికారి సత్యనారాయణ, ఎంపీపీ పూసాల ప్రణయ్ కుమార్, జెడ్పీటీసీ సాలిగామ బానయ్య, ఎంపీటీసీలు సూరం రవీందర్ రెడ్డి, సిరంగి శంకర్, ఎంపీటీసీలు, పంచాయతీ కార్యదర్శులు, గ్రామస్తులు పాల్గొన్నారు.



గుడిపేట గ్రామసభలో మాట్లాడుతున్న డీపీఓ వెంకటేశ్వర్‌రావు



ఆస్నాదలో పనులు పరిశీలిస్తున్న ఎంపీడీవో



బెల్లంపల్లిరూరల్: పనులు పరిశీలిస్తున్న ఎంపీడీవో



దండేపల్లిలో మాట్లాడుతున్న ఎంపీడీవో మల్లేశం



భీమారం మండలం నర్సింగాపూర్‌లో...



గ్రామసభలో పాల్గొన్న మాజీ సర్పంచ్

మొక్కుబడిగా...

కోటపల్లి: ప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా చేపట్టిన గ్రామసభల్లో అధికారుల నిర్లక్ష్యంతో గ్రామసభలు తూతూమంత్రంగా జరిగాయి. మండలంలోని సుపాక గ్రామసభలో ఎంపీడీవో భాస్కర్ మాజీ సర్పంచ్ కాశెట్టి సతీశ్‌ను అధికారికంగా నిర్వహించే గ్రామసభలో కూర్చోబెట్టుకుని గ్రామసభ నిర్వహించడం చర్చనీయాంశంగా మారింది. కాగా ఎడగట్ట గ్రామపంచాయతీ ప్రత్యేకాధికారిగా డిప్యూటీ తహసీల్దార్ నవీన్‌కుమార్‌ను నియమించారు. ప్రభుత్వ నిబంధనల ప్రకారం గెజిటెడ్ స్థాయి అధికారినే ప్రత్యేకాధికారిగా నియమించాలని ఆదేశాలు ఉన్నప్పటికీ మండలంలోని అధికారులు అందుకు విరుద్ధంగా ఆర్ఐ రాజలింగుతో గ్రామసభను తూతూమంత్రంగా నిర్వహించారు. బొప్పారంలో ప్రత్యేకాధికారి రేంజర్ రవి పాత సీఎం, పాత మంత్రి ఉన్న ఫ్లెక్సీతోనే గ్రామసభ నిర్వహించారు. ఈ విషయంపై ఎంపీడీవోను వివరణ కోరగా, గ్రామంలోని మిషన్ భగీరథ పనులపై చర్చించేందుకు మాజీ సర్పంచ్ వచ్చారని, ఎడగట్ట గ్రామసభలో డీటీ ఎన్నికల విధుల్లో ఉండటం వల్ల ఆర్ఐని నియమించుకుని ఉంటారని తెలిపారు.



ఎడగట్ట గ్రామసభలో ఆర్ఐ రాజలింగు

'గావ్ చలో అభియాన్'



కేంద్ర ప్రభుత్వ పథకాలు వివరిస్తున్న జిల్లా అధ్యక్షుడు రఘునాథ్, నాయకులు

మంచిర్యాలరూరల్(హాజీపూర్): దేశంలో మూడోసారి బీజేపీ ప్రభుత్వం ఏర్పాటు చేయడమే లక్ష్యంగా బీజేపీ ఆధ్వర్యంలో గావ్ చలో అభియాన్(పల్లెకు పోదాం) కార్యక్రమంలో భాగంగా బుధవారం హాజీపూర్ మండలంలో బీజేపీ రాష్ట్ర, జిల్లా నాయకులు విస్తృతంగా పర్యటించారు. బీజేపీ ప్రభుత్వ సంక్షేమ పథకాలను వివరిస్తూ ప్రజలను చైతన్యం చేశారు. బీజేపీ రాష్ట్ర సీనియర్ నాయకుడు అల్లపూర్ శ్రీనివాస్, జిల్లా అధ్యక్షుడు రఘునాథ్ వెరబెల్లి, మాజీ సర్పంచ్ జూపాక రాజేశ్వరి తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా రమాబాయి అంబేద్కర్ జయంతి

రామకృష్ణాపూర్: భారత రాజ్యాంగ నిర్మాత డాక్టర్ బీఆర్ అంబేద్కర్ సతీమణి రమాబాయి అంబేద్కర్ జయంతిని బుధవారం పట్టణంలో ఘనంగా నిర్వహించారు. స్థానిక మండల పరిషత్ పాఠశాలలో రమాబాయి చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. విద్యార్థులకు పండ్లు పంపిణీ చేశారు. దళిత బహుజన నాయకులు పలిగిరి కనకరాజు,కనకం వెంకటేశ్వర్లు, గంగారాం, కుమార్ తదితరులు పాల్గొన్నారు.

వేమనపల్లి: మండలంలోని సుంపుటంలో రమాబాయి అంబేద్కర్ జయంతిని కేవీపీఎస్ జిల్లా ప్రధాన కార్యదర్శి మోహన్ ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. కార్యక్రమంలో కేవీపీఎస్ మండల అధ్యక్షుడు సంజీవ్, రాజమల్లు, శంకర్, రమేష్, శ్రీనివాస్ పాల్గొన్నారు.

విద్యార్థులకు సైన్స్ విజ్ఞాన పోటీలు

దండేపల్లి: జాతీయ సైన్స్ దినోత్సవాన్ని పురస్కరించుకుని దండేపల్లి ఎమ్మార్సీ కార్యాలయంలో బుధవారం విద్యార్థులకు సైన్స్ విజ్ఞాన పోటీలు నిర్వహించారు. సుస్థిర భవిష్యత్‌కు సైన్స్ ఆవశ్యకత అనే అంశంపై విద్యార్థులకు మండల స్థాయిలో ఉపన్యాస, చిత్రలేఖనం, పాటలు, కవిత పోటీలు నిర్వహించారు. పాటల పోటీల్లో ఆలేఖ్య, కవిత పోటీల్లో దీక్షిత(జెడ్పీ ఉన్నత పాఠశాల వెల్గనూర్), చిత్రలేఖనంలో శ్రీహిత(జెడ్పీ ఉన్నత పాఠశాల ద్వారక), ఉపన్యాస పోటీల్లో అంజి(జెడ్పీ ఉన్నత పాఠశాల గుడిరేవు)లు ప్రతిభ కనబరిచి జిల్లా స్థాయికి ఎంపికయ్యారు. కార్యక్రమంలో ఎంఐఎస్ నగేష్, ఉపాధ్యాయురాలు సునీత, సీఆర్పీలు గరిగే నర్సయ్య, ఇప్ప సురేందర్, ఉగ్గె రమేష్ పాల్గొన్నారు.



మాట్లాడుతున్న హెచ్‌ఎం విక్రమ్

విజేతలకు బహుమతుల ప్రదానం

తాండూర్: మండలంలోని తంగళ్లపల్లి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో విద్యార్థులకు కవితలు, చిత్రలేఖనం, పాటలు, ఉపన్యాస పోటీలు నిర్వహించారు.విజేతలకు బహుమతులు అందజేశారు. చిత్రలేఖనంలో విద్యా భారతి పాఠశాలకు చెందిన తహస్య రాఘవి, కవితల పోటీలో కస్తూర్బా గాంధీ బాలికల విద్యాలయానికి చెందిన హసిత, పాటల పోటీల్లో అచలాపూర్ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలకు చెందిన హర్షిత, ఉపన్యాస పోటీల్లో అచలాపూర్ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలకు చెందిన హస్నిత బహుమతులు కైవసం చేసుకున్నారు. వీరికి పాఠశాల ప్రధానోపాధ్యాయుడు మల్లేశం, ఉపాధ్యాయులు బహుమతులు అందజేశారు.

భీమారం: స్థానిక జెడ్పీ ఉన్నత పాఠశాలలో బుధవారం జాతీయ సైన్స్ దినోత్సవం నిర్వహించారు. మండలంలోని అన్ని జెడ్పీ ఉన్నత పాఠశాలలకు చెందిన విద్యార్థులకు చిత్రలేఖనం, పాటలు, ఉపన్యాస పోటీలు నిర్వహించారు. మండల స్థాయిలో గెలుపొందిన వారికి 10తేదీన జిల్లా స్థాయి పోటీల్లో పాల్గొంటారని హెడ్మాస్టర్ విక్రమ్ తెలిపారు.

గురుకుల ప్రిన్సిపాల్‌ను సస్పెండ్ చేయాలి

మంచిర్యాలటౌన్: జిల్లాలోని ముల్కల్ల తెలంగాణ సాంఘిక సంక్షేమ గురుకుల పాఠశాలలో విద్యార్థులకు పురుగుల అన్నం ఆహారం పెడుతున్న ప్రిన్సిపా ల్ మోహన్‌ను సస్పెండ్ చేయాలని విద్యార్థి సంఘాల నాయకులు బుధవారం గురుకులాల ఆర్సీవో స్వరూపరాణికి వినతి పత్రం అందించారు. విద్యార్థులకు సరైన ఆహారం అందించకుండా, అందుబాటులో ఉండకుండా విద్యార్థులపై నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారని ఆరోపించారు. తక్షణమే విచారణ చేప ట్టి ప్రిన్సిపాల్, సిబ్బందిపై చర్యలు తీసుకుని ఇలాంటివి పునరావృతం కాకుండా ప్రిన్సిపాల్‌ను సస్పెండ్ చేయాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో విద్యార్థి సంఘాల నాయకులు బచ్చలి ప్రవీణ్ కుమార్, షేక్ సల్మాన్ పాష, జుమ్మిడి గోపాల్ పాల్గొన్నారు.



ఆర్సీవోకు వినతిపత్రం ఇస్తున్న నాయకులు

మంచిర్యాలరూరల్(హాజీపూర్): హాజీపూర్ మండల ముల్కల్లలోని సాంఘిక, సంక్షేమ పాఠశాల, కళాశాల గురుకుల వసతి గృహంలోని విద్యార్థులకు నాణ్యమైన భోజనం కల్పించాలని కోరుతూ బుధవారం ఎస్ఎఫ్ఐ ఆధ్వర్యంలో మంచిర్యాల ఆర్సీవో సూపరింటెండెంట్ సమ్మయ్యకు వినతిపత్రం అందజేశారు. ప్రిన్సిపాల్‌పై చర్యలు తీసుకోవాలని విన్నవించారు. కార్యక్రమంలో ఎస్ఎఫ్ఐ జిల్లా కార్యదర్శి మిట్టపల్లి తిరుపతి, జిల్లా అధ్యక్షుడు దాగం శ్రీకాంత్ పాల్గొన్నారు.

సింగరేణి ఆధ్వర్యంలో రక్తదాన శిబిరం

మందమర్రిరూరల్: మందమర్రి ఏరియాలోని పాలచెట్టు వద్ద గల సింగరేణి గనుల వృత్తి శిక్షణ కేంద్రం (ఎంవీటీసీ)లో బుధవారం సింగరేణి ఆధ్వర్యంలో రక్తదాన శిబిరం ఏర్పాటు చేశారు. కార్యక్రమానికి ముఖ్య అతిథిగా ఏరియా జీఎం మనోహర్ హాజరై ప్రారంభించారు. 77మంది యువ కార్మికులు రక్తదానం చేయగా వారికి ఆయన ప్రశంస పత్రాలు అందించారు. ఈ సందర్భంగా జీఎం మాట్లాడుతూ దాతల నుంచి సేకరించిన రక్తాన్ని మంచిర్యాలలోని బ్లడ్ బ్యాంకులో నిలువ చేయనున్నట్లు, తలసేమియా, సికిల్‌సెల్ వ్యాధి గ్రస్తులతో పాటు ప్రమాదాలకు గురైన వారికి ఉపయోగపడుతుందన్నారు. ఏరియా సేఫ్టీ ఆఫీసర్ రవీందర్, ఎంవీటీసీ మేనేజర్ శంకర్ తదితరులు ఉన్నారు.



ప్రశంస పత్రం ఇస్తున్న జీఎం మనోహర్

బాల్క సుమన్ దిష్టిబొమ్మ దహనం



శ్రీరాంపూర్ ఓపెన్ కాస్ట్ వద్ద...



ఆర్కే ఓసీలో దిష్టిబొమ్మ దహనం చేస్తున్న నాయకులు



మందమర్రిలో...

శ్రీరాంపూర్: రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డిపై అనుచిత వ్యాఖ్యలు చేసిన మాజీ ఎమ్మెల్యే బాల్క సుమన్ దిష్టిబొమ్మను ఐఎన్టీయూసీ నాయకులు దహనం చేశారు. ఆ యూనియన్ ఆధ్వర్యంలో బుధవారం పలు గనులపై నల్లబ్యాడ్జీలు ధరించి నిరసన తెలిపారు. బాల్క సుమన్ బేషరతుగా క్షమాపణలు చెప్పాలని డిమాండ్ చేశారు. క్షమాపణ చెప్పకుంటే ఆయనను సింగరేణిలో అడుగుపెట్టనివ్వమని హెచ్చరించారు. జట్టి శంకర్రావు, భీంరావు, కలవేన శ్యామ్,తదితరులు పాల్గొన్నారు.

రామకృష్ణాపూర్: బాల్కసుమన్ చేసిన అనుచిత వ్యాఖ్యలను ఖండిస్తూ ఐఎన్టీయూసీ ఆధ్వర్యంలో మందమర్రి ఏరియాలోని ఆర్కే ఓసీలో సుమన్ దిష్టిబొమ్మను దహనం చేశారు. ఐఎన్టీయూసీ పిట్ కార్యదర్శి రమేష్, నాయకులు పాల్గొన్నారు.

బెల్లంపల్లి: బెల్లంపల్లి సింగరేణి ఏరియా ఆసుపత్రి ఎదుట ఐఎన్టీయూసీ, కాంగ్రెస్ శ్రేణులు నల్లబ్యాడ్జీలు ధరించి నిరసన తెలిపారు. సుమన్‌కు వ్యతిరేకంగా నినాదాలు చేశారు. టీ పీసీసీ సభ్యుడు మత్తమారి సూరిబాబు, కాంగ్రెస్ పట్టణ అధ్యక్షుడు మల్లయ్య తదితరులు పాల్గొన్నారు. మందమర్రి ఏరి యా శాంతిఖని గనిపై ఐఎన్టీయూసీ ఆధ్వర్యంలో బాల్కసుమన్ దిష్టిబొమ్మ దహనం చేశారు. ఐఎన్టీయూసీ గని పిట్ సెక్రెటరి పారుపల్లి శివకుమార్, నాయకులు పాల్గొన్నారు.

మందమర్రిరూరల్: ఏరియాలోని కేకే–5 గనిపై ఐఎన్టీయూసీ నాయకులు బాల్క సుమన్ దిష్టిబొమ్మను దహనం చేశారు. రాంశెట్టి నరేందర్, సదయ్య, తిరుపతి, రాజేంద్రప్రసాద్, కృష్ణమోహన్, రాజ్‌కుమార్, దేవేందర్ తదితరులున్నారు.

చర్యలు తీసుకోవాలి

మంచిర్యాలఅర్బన్: బెల్లంపల్లి పట్టణంలో అనుమతి లేకుండా నిర్వహిస్తున్న పాఠశాలపై చర్య తీసుకోవాలని ఎస్ఎఫ్ఐ ఆధ్వర్యంలో బుధవారం మంచిర్యాల డీఈవో యాదయ్యకు వినతిపత్రం అందజేశారు. ఓ పాఠశాలపై అనుమతి తీసుకుని నిబంధనలు ఉల్లఘించి మరో పేరిట పాఠశాల నిర్వహిస్తున్నారని ఆయన దృష్టికి తీసుకొచ్చారు. కార్యక్రమంలో ఎస్ఎఫ్ఐ జిల్లా అధ్యక్షుడు శ్రీకాంత్, ప్రధాన కార్యదర్శి తిరుపతి పాల్గొన్నారు.

కాంట్రాక్ట్ ఉద్యోగులకు వైద్య పుస్తకాలు



వైద్య పుస్తకాలు అందించిన కేకే-ఓసీ పీవో రమేష్

మందమర్రిరూరల్: మందమర్రి ఏరియాలోని కేకే–ఓసీలో బ్లాస్టింగ్ విభాగంలో విధులు నిర్వర్తిస్తున్న కాంట్రాక్ట్ ఉద్యోగులకు బుధవారం గని ప్రాజెక్ట్ ఆఫీసర్ రమేష్ వైద్య పుస్తకాలు అందించారు. అధికారులు వీరయ్య, కుశ్వా పాల్గొన్నారు.

సమ్మె విజయవంతం చేయాలి

పాతమంచిర్యాల: ఈ నెల 16న జరిగే దేశవ్యాప్త కార్మిక రైతాంగ సమ్మెను విజయవంతం చేయాలని ప్రగతి శీల మహిళా సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి అందె మంగ అన్నారు. జిల్లా కేంద్రంలోని మార్క్స్ భవన్‌లో సమావేశం నిర్వహించారు. మతోన్మాద బీజేపీ ప్రభుత్వ విధానాలకు వ్యతిరేకంగా నిర్వహించే ఈ సమ్మెకు ప్రగతి శీల మహిళ సంఘం సంపూర్ణ మద్దతు తెలుపుతుందన్నారు.

అభివృద్ధి కోసం చర్చించకుండా నిందలు వేస్తారా..?

- మున్సిపల్ చైర్‌పర్సన్ శ్వేత

బెల్లంపల్లి: ఎమ్మెల్యే గడ్డం వినోద్ హాజరైన మున్సిపల్ సాధారణ సమావేశంలో స్వతంత్ర సభ్యులు మున్సిపల్ అభివృద్ధి గురించి చర్చించకుండా తనపై వ్యక్తిగత నిందలు వేయడం సమంజసం కాదని బెల్లంపల్లి మున్సిపల్ చైర్‌పర్సన్ జక్కుల శ్వేత అన్నారు. బుధవారం ఆమె మున్సిపల్ కార్యాలయంలోని తన ఛాంబర్‌లో మాట్లాడారు. తాను ఏ సభ్యుడిని కూడా వ్యక్తిగతంగా దూషించలేదని, అనుచిత వ్యాఖ్యలు చేయలేదని పేర్కొన్నారు. ఓ విషయంలో తాను చిల్లర మనిషిని కాను, చైర్ పర్సన్‌ను అని మాట్లాడగా తన మాటలను వక్రీకరించి అనవసరంగా రాద్ధాంతం చేశారని తెలిపారు. మున్సిపల్ అభివృద్ధి కోసం కాకుండా స్వతంత్ర సభ్యులు మరోసారి వ్యక్తిగత నిందలు వేస్తే ఊరుకునేది లేదని హెచ్చరించారు. కౌన్సిలర్లు బుక్య రామునాయక్, ప్రభాకర్, రవి, సంగీత తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న చైర్‌పర్సన్ శ్వేత

సాదాసీదాగా మండల సమావేశాలు

చెన్నూర్‌రూరల్: స్థానిక మండల ప్రజా పరిషత్ కార్యాలయంలో బుధవారం ఎంపీపీ మంత్రి బాపు అధ్యక్షతన సాధారణ సర్వసభ్య సమావేశం నిర్వహించారు. అభివృద్ధి పనుల వివరాలను ఎంపీపీ అధికారులను అడిగి తెలుసుకున్నారు. నాటుసారా అమ్మకాలు అధికంగా జరుగుతున్నాయని, సంబంధిత అధికారులు చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. గంగారం, కాచన్‌పల్లి, కిష్టంపేట గ్రామాల్లో చెరువుల్లో పూడిక తీయించాలని సంబంధిత ఎంపీటీసీలు కోరగా, విషయాన్ని ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్తామని ఇరిగేషన్ అధికారి తెలిపారు. తాగునీరు, విద్యుత్ అంతరాయం లేకుండా చూడాలని, అధికారులు సహకరించాలని ఎంపీడీవో శ్రీనివాస్ కోరారు. సమావేశంలో అధికారులు, ప్రజాప్రతినిధులు పాల్గొన్నారు.

నామమాత్రంగా లక్సెట్టిపేట సమావేశం

లక్సెట్టిపేట: స్థానిక ఎంపీడీవో కార్యాలయంలో బుధవారం ఎంపీపీ అన్నం మంగ ఆధ్యక్షతన నిర్వహించిన మండల సమావేశం నామమాత్రంగా నిర్వహించారు. సర్పంచుల గడువు ముగియడంతో అధికారులు, ప్రత్యేకాధికారులు, ఎంపీటీసీలు మాత్రమే హాజరయ్యారు. ఫారెస్టు, ఎక్సైజ్ పలు శాఖల అధికారులు హాజరు కాకపోవడంతో పై అధికారులకు వివరణ ఇవ్వాలని తీర్మానం చేశారు. ఇప్పటి వరకు నిర్వహించిన పనులు, భవిష్యత్ కార్యాచరణపై చర్చించారు.

ప్రజా సమస్యల పరిష్కారానికి కృషి

నెన్నెల: ప్రజా సమస్యల పరిష్కారం కోసం ప్రత్యేక అధికారులు, ఆయా శాఖల అధికారులు పనిచేయాలని ఎంపీపీ రమాదేవి అన్నారు. స్థానిక ఎంపీడీఓ కార్యాలయంలో బుధవారం సాధారణ సర్వసభ్య సమావేశం నిర్వహించారు. 24అంశాలపై చర్చ జరగాల్సి ఉండగా కేవలం 5అంశాలపైనే చర్చ కొనసాగింది.

సంక్షిప్త వార్తలు

బహుమతులు ప్రదానం

కాసిపేట: మండలంలోని మారుమూల గిరిజన గ్రామం గట్రావుపల్లిలో రఘుపతిరావు చారిటబుల్ ట్రస్ట్ సభ్యులు కొక్కిరాల సత్యపాల్‌రావు ఆధ్వర్యంలో నిర్వహించిన మండల స్థాయి వాలీబాల్ టోర్నమెంట్‌లో గెలుపొందిన జట్లకు బుధవారం బహుమతులు అందజేశారు. రెండు రోజుల పాటు నిర్వహించిన టోర్నీలో 16జట్లు పాల్గొనగా దేవాపూర్ జట్టు విజయం సాధించగా, తుడుంగూడ జట్టు ద్వితీయ స్థానంలో నిలిచింది.

తాగునీటి సమస్య పరిష్కరించండి

వేమనపల్లి: మండలంలోని దస్నాపూర్ గ్రామపంచాయతీలోని కొత్తపల్లిలో తాగునీటి సమస్యతో ఇబ్బందులు పడుతున్నామని మాజీ సర్పంచ్ కొమురం రమేష్ ఆధ్వర్యంలో ప్రత్యేక అధికారి నరేష్‌కు వినతిపత్రం అందజేశారు.

నియామకం

కాసిపేట: మండల కేంద్రానికి చెందిన ఏల్పుల అనిల్‌కుమార్ యాదవ్‌ను జిల్లా భారత యాదవ సమితి జిల్లా యూత్ అధ్యక్షుడిగా నియమించినట్లు సంఘం రాష్ట్ర అధ్యక్షుడు నగేష్ యాదవ్, వర్కింగ్ ప్రెసిడెంట్ సిద్ది రమేష్ యాదవ్ ప్రకటించారు.

సన్మానం

చెన్నూర్‌రూరల్: మండలంలోని ఆస్నాద గ్రామంలోని జిల్లా పరిషత్ సెకండరీ పాఠశాలలో పని చేసి బదిలీపై వెళ్తున్న హెచ్‌ఎం శోభారాణి, ఉపాధ్యాయులు రమణారావు, జంపన్న, సంతోష్‌కుమార్‌ను బుధవారం ఉపాధ్యాయులు సన్మానం చేశారు.

'పార్టీలకతీతంగా ఆహ్వానించాలి'

మందమర్రిరూరల్: మండలంలోని గ్రామ పంచాయతీల్లో నిర్వహించే ప్రత్యేక సమావేశాలకు ప్రత్యేకాధికారులు రాజకీయాలకు అతీతంగా అందరినీ ఆహ్వానించాలని కాంగ్రెస్ పార్టీ మండల ఇన్‌చార్జి కడారి జీవన్ డిమాండ్ చేశారు.

'గ్రామాల అభివృద్ధికి కృషి'

నెన్నెల: గ్రామాభివృద్ధికి గ్రామాభివృద్ధికి ఎంతో కృషి చేశారని ఎంపీపీ రమాదేవి అన్నారు. మండల పరిషత్ కార్యాలయంలో సర్పంచుల పదవీ కాలం పూర్తి అయిన సందర్భంగా బుధవారం మాజీ సర్పంచులను ఆమె సన్మానించారు.

విద్యార్థులకు రక్త పరీక్షలు

తాండూర్: మండలంలోని తంగళ్లపల్లి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో విద్యార్థులకు బుధవారం రక్త పరీక్షలు నిర్వహించారు. 8 నుంచి పదో తరగతి చదువుతున్న విద్యార్థులకు రక్త పరీక్ష నిర్వహించి హిమోగ్లోబిన్ శాతాన్ని నమోదు చేశారు.